రక్తి బికారి

కవికొండల వెంకటరావు

"ఆమెకౌగింటిలో సాకోర్క పండిస్తి,
ఆమెకందోయిలో నావీడ నిర్మిస్తి,
ఏవాడనై నాను గన్నారుబ్రా ?
నాచేడెజాడ తెలిసుంటె చెప్పర!
పెదపెద్దవీథుల్ల పిలిచి విసికాను,
ఇసుకతిన్నెల నీలవేసి యలిసాను,
మసకసంజలో సందియంగ భ్రమిశాను,
కొసకు గాదని తెలిసి కదలిడాశాను."

అనుచు విరహ విహ్వాలుడై బికారీ వొకడు వెన్నెట్లో విశాఖపట్నపు సముద్రతీరాన్న "స్కాండల్ పాయింటు" దగ్గఱనుంచి పాడుకుంటూ, "ఏంకర్ పాయింటు" ప్రాంతానికి జేరుకున్నాడు. అప్పు డక్కడ జనం పెద్దవాళ్లెవళ్లూ లేరు. పల్లెపిల్లలు కూళ్లుతిని వెన్నెల్లో ఆడుకుంటూ వున్నారు. ఓ పడిపోయిన కొబ్బరిచెట్టుయొక్కమోడు మోచేతినిక్కుగా అమరివుంటే దాని చివ రెక్కి ఊగుతూ వున్నారు.

కుఱ్ఱవాళ్లా పాటట్టుకుని "ఆమె కౌగింటిలో - ఆమె కౌగింటిలో" అని ఊగడం మఱీ ఎక్కువచేసికొంటూ సముద్రం కేసి చూచినారు. వాళ్ల కెవరూ కనిపించలేదు. మఱీ పాట వినిపించనూ లేదు. ఎక్కణ్ణుంచి వచ్చి, ఆపాటక్క డాగిపోయిందో తెలిసికొందామని ఆ పిల్లకాయ లందఱూ మూకుమ్మడిగా సముద్రపువొడ్డుకు వెన్నెట్లో పఱుగెత్తినారు గాని, సీటిపందకు జేరే అంతలో, చంద్రుణ్ణి వోమేఘం కప్పి పుచ్చడంచేత, చీకటికి జడిసినవారై, తమ నెమకుడుపుద్యమాన్ని మానుకొని, ఆటలు కూడా కట్టిపెట్టి, తమతమ గుడిసెలకు మళ్లి పోయి ముణుచుకు తొంగుడుంకిపోయినారు.

క్రమశగ తెల్లాఱొచ్చి, సూర్యోదయం కూడా అయింది. సముద్రమ్మీద తెల్లాఱి సూర్యోదయం అయిందీ అంటే, సముద్రమ్మీదివాళ్లమాట నేను చెప్పలేను గాని భూమ్మీదవాళ్లకు మాత్రం మిక్కిలీ సంతోషం.

"ఉదయించవయ్యా! ముదముగనవయ్యా!
ఉదధిపై దరిలేని తొలితోయములదోగి
యుదయించవయ్యా! ముదముగనవయ్యా!
బాలార్క దేవా! ప్రభచిల్కవయ్యా!
ప్రచురింపవయ్యా! శుచిగొల్పవయ్యా!

సంద్రన్ని గోళంబు గుండెఆందోళంగ
ఎలు పెక్కవయ్యా! ఒలుపుగనవయ్యా!"

అనిఆ వుదయం యత్నులనుంచి పత్నులవఱకూ పాడుతూ ఆహ్వానిస్తూవుంటే అతిశయించిపోయినాడా అన్నట్టు సూర్యుడుదయించాడు సముద్రతీరపు తూరుపువొంక. సూర్యబింబం అలా జాజువాలుతూ తడీపొడి నెగసిపోతూ వుంటే ఏకాడి కాకాడికే అందంఅనిపించింది. ఏక్కడికక్కడే ప్రకృతి అనే నిండుచూలాలి కడుపుపండి తరించిందా అన్నట్టుంది. ఆబాల సూర్యుణ్ణి ప్రస్ఫుట ప్రభ నెత్తిపట్టి యింకను తనివిసనక సముద్రుడు తన నీలిసీటి నూగుచు, ఆ బింబముయొక్క అడుగుభాగపు టరుణ రేఖను లేచి లేచి ముద్దుగొనే క్రొంగ్రొత్త ఘడియల్ని, మొగంవాచినట్లు తనలో ప్రతిబింబించుకునే లేలేతభావాల్ని ఏమనగలం? కాలం అని అనగలమా? అవకాశం అని అనగలమా? — నల్లనిమేఘం మందేహం లాగు అదెందుకక్కడ? ఆసఱుయమప్పుడు దాని కేంపని? దానిలోనికి రవికిశోరుడు ప్రవేశించి, అందులోనుంచి పైకి విజృంభించుకుంటూ రంకెలు విసురుతూవుంటే క్రింద దిఙ్మండలం మఱింత యెఱ్ఱనై నిజంగా కెంపు రజంతో పునాదికట్టుకట్టినట్టు విలసిల్లిపోయింది. ఆశాంతాన్ని మెలకువగొని లేచివస్తూవున్న ప్రతీకరదుయొక్క కొనమీదనూ తెలుస్తూనే వుంది అరుణోదయశోభ. మఱిన్ని అలధట్టిన చెలియలికట్టయొక్క ఏటవాలు తెన్నె జిగిబిగిగా యినకతో సమేలమై విరాజిల్లింది దినమణియొక్క పురిటింటికళ. అంతేనా? నిరాధారంగా వారకొచ్చి పడ్డ కోడకెరటంయొక్క అకాలవైరాగ్యమునా విరియు తెల్లని నుకువుల మల్లెవండ నెడనెడ లోకబాంధవ్యమను రోజాపువ్వులు కలగలిపి గ్రుచ్చుపోలిక తొంగరెక్కించి ఇక్కడ నక్కడ నెక్కడ చూచిన "ఈ కెరటమే నీ రక్తిబికారీ! ఈ కెరటమే నీరక్తిబికారీ!" అని అందఱికీ చూపించినట్టయింది ఆనాటి చిటి పొటి పొద్దుపొడుపు.

*   *   *

వాళ్ల అసలుపేర్లు మనకు తెలియవుగాని వైద్యకళాశాలలో చదువుకోడానికి ప్రవేశించినప్పటినుంచీ "ఏమే కనకాంబరం!" అంటే "ఏమే నీలాంబరం!" అని అనుకుంటూ అన్యోన్యం బస్తీజోస్తీగా నేస్తం గలిగివున్న విద్యార్థినులిద్దఱు విశాఖపట్నంలో వున్నారు. వాళ్లిద్దఱూ పై వుదయమప్పుడు రోడ్డే మోటారుకారెక్కి వచ్చినవాళ్లై కారు రోడ్డు మీద నిలిపి తాముమాత్రం సరిగ్గా సముద్రపు వొడ్డుకు వెళ్లిపోయి, అదురూ బెదురూ లేకుండా నవనవప్రభాతపవమానప్లవమానలై విహరిస్తూ వున్నారు. హార్బరు వచ్చింతరువాత "యేంకర్ పాయింటు" అంటూ వొకటి కుదిరిందికాని, అనాదిప్రసిద్ధమైంది యిదే యీ "స్కాండల్ పాయింటే"ను అని వాళ్లల్లో వాళ్లనుకుంటూ వున్నారు. సముద్రంకేసి చూస్తూ వున్నారు. — జనసామాన్యం అనుకోవడమేగాని నేనెప్పుడూ ఇక్కడ

వాక్క "స్కాండలూ" చూడలేదు అంది కనకాంబరం. అసలు "స్కాండల్" అంటూ వొకటీ ప్రపంచంలో వుందా అంది నీలాంబరం.

సూర్యుడు ఎఱుపుడాలు విడిచిపెట్టి తెలుపుతీక్ష్ణతలోపడి నీళ్లమీద మిఱుమిట్లు గొల్పుతున్నాడు తీర్థాలరాళ్లసరసని పల్లె పడుచులు కొబ్బరిపీచు చితక్కొడుతూ వున్నారు. పల్లెవాళ్లు కొందఱు తాళ్లు పెనేసుకుంటూ వున్నారు. లోకానికి కాస్తో కూస్తో అప్పుడే వేడెక్కింది దన్నట్టు ఓ యురేషియన్ యువకుడు ఓ యురేషియన్ యువతిని సైకిలుమీద కూర్చోపెట్టుకొని తాను తొక్కుకుంటూ ఆమెమీదకు వొరుగుతూ దీపస్తంభంకేసి వెళ్లిపోతూవున్నాడు. ఎవో వోచోటను పూళ్లోనుంచి రోడ్డుదిగి, సముద్రపు టిక్క వేగం రెట్టించి ప్రియురాలి చెక్కిలి వొంగొంగి ముద్దుపెట్టుకుంటూ — వెళ్లిపోతూ వున్నాడు.— అటువంటి మహాభోగ తరుణంలో ఎవడు చూచాడో మనం చెప్పలేంగాని, ఎవడో చూచాడు సముద్రం మీద ఓశవం తేలి వొడ్డుకు కొట్టుకొస్తూ వుండడం — మధ్య మధ్య కెరటాల్లోపలికి పోతూ మళ్లీ వొడ్డునపడి మళ్లీ నీళ్లల్లోకి పోతూవుండడం ఎవడో కనిపెట్టాడు. కొందఱు కర్రేమో అన్నారు. కొందఱు ఏదీ కాదు కెరటమే నన్నారు. మనిషేమిటి, మనవాళ్లంతా యిక్కణ్ణే వున్నారు అన్నారు కూడాను. తుద కెలాగైతేం మనిషి అని పల్లెపాలెంవాళ్లంతా నిర్ధారణచేసి వారివారికి చెవినివేసికొంటూ చేపచుట్టూ చేరినట్టు చేరుకున్నారు. ఆలా చూస్తూవుండగానే ఆశవం తీర్థాలరాళ్లదగ్గఱ వొడ్డుకు జేరుకుంటుందని అనుకున్నదల్లా మఱి రెండు ఫర్లాంగులు అటువైపుగా, కనకాంబరం నీలాంబరం అనేవారిద్దఱూ పచారుచేస్తూవున్న రేవుకేసి చేరుకొంది.

ప్రజల కోలాహలం అంతకంత కెక్కువయింది. ఆకోలాహలం అట్టాఅట్టా విద్యార్థినుల చెవుల్లో కెక్కింది. కనకాంబరం అంది "అక్కడేదో జనం మూగుతూ వున్నట్టుగా వున్నారు, చూసిపోదామా?" అని. నీలాంబరం "కారు రోడ్డుమీద దిగబెట్టామే?" అంది. కనకాంబరం "ఫరవాలేదు. ఇప్పుడు తిరిగిరాం?" అంది. బయల్దేరారు.

షూఫర్ లేకుండా కారేసుకుని కనకాంబరం, నీలాంబరం అన్న ఆపిల్లలిద్దఱూ తిన్నగా సముద్రపొడ్డుకు వచ్చేశారూ అంటే ఆపిల్లలకున్న ముందంజెయొక్క భాగ్యరేఖ వేఱే వర్ణించాలా?

* * * *

ప్రజలమధ్య నున్న దేమా అని తల్లెత్తి చూచినవారై, కనకాంబరం, నీలాంబరం కూడా పరస్పరం దృక్కులు సవరించుకున్నారు. కనకాంబరం "ఇంకా ప్రాణం వున్నట్టు వుంది ఆబొందిలో"నంది. నీలాంబరం జనాన్ని వొత్తిగించివేసి "కట్టెకు బాగా గాలీ ఎండా

తగల్నివ్వండి" అంది. కనకాంబరం ఆ యుల్లోలకల్లోలునియొక్క యుడుపులు వదులుచేసి, కొంతయిసుక ప్రోవుచేసి, తలాడగా వాని తలక్రిందకు జొప్పించి, నాలిక పైకి లాగిపట్టి, బోర్లాపరుండబెట్టి వెన్నెముక భాగాన్ని నొక్కీనీ, తిరిగి వెల్లకిలా త్రిప్పి ముక్కూ మూతీ తుడిచినీ, నీళ్లు కక్కించి, నీలాంబరంకేసి సంజ్ఞగా చూచింది. నీలాంబరం తన మెడలో కాసులపేరుమాదిరిగా వేసి కొన్న గుండెరొదకొలగొట్టం కనకాంబరాని కందిచ్చింది. కనకాంబరం బొందిని పరీక్షించి, 'హార్టు' 'లంగ్సు' సరిగ్గానే వున్నాయి, తెలతెలవారుతూంటే ఈరోజునే నీటిలో పడి వుండాలి యీపురుషుడు అంది. చేయవలసిన ప్రథమచికిత్సాసాహాయ్యము మఱికొంత ఒక అరగంట ముప్పావుగంటవఱకూ అక్కణ్ణే గావిస్తూ, నిప్పూ ఉప్పూ తెప్పించి, కాచి వీచి, చేతు లెగసాచి, దిగమోచి, ఎలాగైతేం, ఆప్రాణిచేత "అమ్మా!" అని అనిపించారు. కాని మనిషి కింకా మంచి వైద్యవిశారదుల సాహాయ్యం అవసరం అన్నట్టు, వారిద్దఱూ కూడా దిక్కులు కలయజూచి, పల్లెవాళ్లల్లో ఇద్దఱ్ని "నాయనలారా! ఈ మనిషిని ఎత్తి తీసికొనిపోయి ఆకనబడే కారులో పెట్టగలరా? అందులో పండుకోపెట్టారా అంటే పదినిమిషాల్లో పెద్దఆసుపత్రికి మేం తీసికొనిపోయి మంచివైద్యం చేయించగలం" అన్నారు. పల్లెవాళ్లు మోసుకుపోవాలంటే ఆలాంటి మనిషినన్నమాటేమిటి? తాటిదుంగనే అమాంతంగా బుజమ్మీద వొక్కొక్క డొక్కొక్క దుంగను మోశేశాస్తారు. కాని అక్కడా మనిషిని మోయడం అనే సందర్భంలో మాత్రం వాళ్లందఱకూ ఎక్కళ్లేని నానుపుడూ కలిగింది.—మోసే కాసంతలోనే గుటుక్కుమంటే! వాళ్లంతా కూడి చంపారంటారేమో. అప్పుడీ అమ్మాయిలక్కడుంటారా? కారెక్కి వుడాయిస్తారుగాని—ఇలాగ్గా వెనుబాటున మొగమొగాలా మొగాల్లు చూచుకోసాగారు. జాగుచేస్తే కాళ్లు మళ్లీ చల్లబడిపోయేటంత అపాయస్థితిలో వుంది దరిబడ్డ ఆ అభాగుని కాలపరిమితి. వెంటనే నీలాంబరం కనకాంబరంతో అంది. "ఆలా నీచెయ్యి మెడక్రిందనుంచి రానియ్యి! నాచెయ్యి ఇలా నడుంక్రిందకు పోనిస్తాను. ఇద్దఱం గంజీకావడిలా మోసుకుపోదాం" అంది. కనకాంబరం సరే అని నీలాంబరానికి తోడ్పాటై యిద్దఱూ ఆలాంటి మనుష్యుని ఎత్తి తమకారుదగ్గఱకు కొనిపోయినారు. చెంతనున్న పల్లెపెద్దలు మఱి అటు చూడలేదు. కాని దూరాన్నున్న కొంత ఊదిగిన పిల్లకాయలుమాత్రం "ఆమె కౌగింటిలో - ఆమెకౌగింటిలో - నని రాత్రి పాడింది వాడేనేమో నర్రా! ఆలా పాడుతూ కెరటాల కౌగిలి అందుకున్నాడు కమోసు పాపం! ఏమొచ్చిందో ఖర్మం!" అని సానుతాపపూర్వకమైన సంభాషణ ఓక్షణం సాగించి మఱీ నిష్క్రమించారు.

* * * *

నీలాంబరం, కనకాంబరంకూడా సముద్రంలోంచి యివ్వలబడ్డవాడు తమకుకాని శరీరి అని యెంతమాత్రమున్నూ ఏవగించుకోకుండా, జాతిరత్నం అన్నంత జాగరూకతతో మోసికొని తమ కారుదగ్గఱకు తెచ్చిదించారు. కారులో లోపలి మెత్త ఏకంగా పఱుపు గలిగివుంటుంది కాబట్టి అందులో పఙుకోపెట్టి గొంపోవచ్చునని వారి ఆశ. ఆ ఆశకొద్దీ కారుతలుపు తెఱచి, దుమ్ముదులపడానికని నీలాంబరం చెయ్యి యిలా అంది. గాలిలోనే చెయ్యి యింకావుంది — కారులో ఆసీటులో ఓ శిశువు కందగడ్డలాంటి ముఖంతో పసుప్పచ్చని పొత్తిలోంచి తొంగిచూస్తూ అడ్డుపడింది. నీలాంబరం "ఏమి టీ వింత ? కనకాంబరం!" అని కేకేసింది. కనకాంబరం ఆ సమయాన్ని ఏం చూస్తూవుందంటే — చిత్తడి జీవియొక్కనాడి పరీక్షిస్తూవుంది. కొంచెం ప్రాంణీవుంటే బాగుండిపోయేని అని అనుకుంటూవుంది— నీలాంబరం వేసిన కేక కులిక్కిపడింది. తాను కూడా కారుదగ్గరసా పోయి రెండోప్రక్కద్వారం గుండా తొంగిచూచింది. "కూచి! కన్న కూచి! ఎంచక్కా దోబూచు లాడుతూందో! ఛీ! ఛీ!" అంది. నీలాంబరం "ఏమిటే కనకాంబరం! ఆ ఆట ? ఇదిచాలా విషమసంధిగా పరిణమించేటట్టుందేవ్ ! ఈ పొద్దున్న మన కేం శకునం అయిందోగాని ? ఏమిటే ఆ ఆటా నవ్వ్వాను !" అంది. కనకాంబరం "వైద్యశాస్త్ర ప్రవీణలంగా విజృంభింపబోయే మనకు ఈ అనుభవం భగవంతుని దయవల్ల లభించిందని సంతోషించక, "విషమసంధి! విషమసంధి!" అని వెనక్కుపోతున్నా వేమిటి ? నీలాంబరం మనకు చావెట్టిదో పుట్టువూ అట్టిదే. అక్కడ మనిషి చావుబదుకులతో వున్నాడూ అంటే ఏం చేశాం ? విచారించి వలసిన సాయం చేశాం! ముందు చేయబోతున్నాం. ఆలాగ్గానే యిక్కడీ చంటి కనబడిందీ అంటే ఏం చెయ్యాలి ? సంతోషించాలి. మనం తగినసాయం ఈ చంటికీ చెయ్యాలి. ఈ చంటిని తిన్నగా మనం ఆసుపత్రికి తీసుకొని వెళ్లి "కానుపు కాను"లో పోషిద్దాం. అంతకంటె మనం చేయదగ్గ సేవ యీలోకంలో మఱేముంది ? నే నీపిల్ల నిల్లావాళ్లోకి తీసికొని, ముందుసీటులో కూర్చుంటాను. నీ వామనిషిని ఎలా గత్తి లోపలి సీటులో జాగ్రత్తగా పరుండబెడతావో పరుండబెట్టి, వానికాళ్ల మీద, గుండెలమీద కారు ముసుగుడు నీలపుగుడ్డ కప్పి నీవు తలుపులు వేసి యివలకు వచ్చి కారునడుపు. నేను తేలికపని పుచ్చుకుని నీకు బరువుపని చెప్పాను అని అనుకోకు" అంది. నీలాంబరం "ఆడవాళ్లకు బరువుపని అంటూ వొకటి వుందా ఏమిటే? చతుర్దశభువనాలూ బొజ్జనిడుకొన్న శ్రీకృష్ణుణ్ణి అమాంతంగా తన కుచాగ్రాలమీద లేవనెత్తిన రామామణి రుక్మిణి చెందినట్టి పద్మినీజాతి కోవలోవాళ్లం మనం! మనకు బరువు అనేపదార్థం వుందా లోకంలో ?"

అంటూ రోడ్డుమీది మనిషిని అపురూపంగా లేవనెత్తి అప్రమత్తత్తో మెత్తని వెనుకసీటు మీద పరుండబెట్టింది నీలాంబరం వొక్కర్తీని. పరుండబెట్టి ఆమె చేతు లలా తీసికొంటూ వుంది. ప్రమాదావస్థనున్న ఆ పురుషుడు కనుఱెప్ప లెత్తి నీలాంబరంమోము చూచి తిరిగి కళ్లుమూసికొన్నాడు. నీలాంబరం కనకాంబరంతో "ఫరవా లేదు, మన మగవాడికి కింక" అంది. కనకాంబరం "మనమగవాడేమిటి ?" నీలాంబరం "మనకు దొరకిన యీమగవాడన్నమాట" అని చిరునవ్వునవ్వుతూ కార్ బ్రుంయిమనిపించింది. బంగారుగాజు లెగద్రోసికుంది. వాలుజడ ముందు కేసుకుంది. "ఆలావచ్చి కూచో కనకాంబరం" అంది. కనకాంబరం పట్టాగొలుసు కాళ్లసల్లించుకుంటూ తమ కానాడు దొరకిన రెండోవింతను అద్దాల్లో పెట్టుకుని అదిపూరికే అనునాసికాక్షర స్ఫుటమైన కెవ్వు గ్రుక్కలతో కేక మన "లేదోయి ! లేదోయి !" అని లాలిస్తూ ముందుసీటులో కూర్చుంది. సముద్రపురోడ్డు నిర్మానుష్యం నిస్తేజం ఇఖన్నట్టు మోటారుకారు వారందరితోనూ మలుపుతిరిగి మటుమాయమైంది.

* * * *

ఆమోటారు అలామలుపు తిరిగేదాకా తదేకధ్యానంగా చూస్తూ మలుపు తిరిగే అంతలో మూర్ఛిల్లినవ్యక్తు లెవరైనా ఆ ప్రదేశంలో వుండి వున్నారేమో చూచి చెప్పండి అని ఇప్పుడు నేను నా పాఠకుల్ని అడుగుతూవున్నాను. చూచి చెప్పండి !

ఒకానొకవ్యక్తి, ఆపసికూనను కన్నటువంటి వ్యక్తి, ఆపసికూనను కని పారేయలేక, వేఱే తలదాచుకోవడానికి తనకు జాగాలేక, దైవికంగా ఖాళీగా కనబడ్డ ఆ కారులో పరుండబెట్టి ఆవలగా చన్నటువంటి వ్యక్తి ఆపసికూనయొక్క మాతృదేవత అదిగో! అదిగో! తనయొక్క పురిటి నెత్తుటి గుడ్డపేలికల నన్నింటిని ఇసకలో కనతిదూరాన్నే కప్పెట్టి, తాను జుత్తుముడేసుకుని, జఘనభాగాన్ని ఎఱ్ఱనిబొంత నక్కలాళ్లలాగు చుట్టబెట్టుకుని, పై నోపటకా బిగించుకొని, అదేమీ యితరుల కగుపడకుండా, చుట్టూ, పసుప్పచ్చంచులుగల సన్నజరీకోక తుంపుడువోహటి కట్టబెట్టుకొని, మామోలు మదవతిలాగు సముద్రపు టొడ్డుయొక్క అఖాతదిశాభాగమందు నిలబడి, రోడ్డుమీద ఆలా పోతూవున్న కారుదుమ్ముకేసి చూచి అనుకుంటూ వుంది. "ఓ దయామయూ ! నీదయవల్లనుగదా బిడ్డకు ఆకారులో తావు దొరికింది. ఇక నాబ్రదు కెలా అయినాసరే! నాకు చింత లేదు. నేను ధన్యనే" అని తనను కకావికలుగ జేసి పాఱవేయుచున్న లోని వికారాన్ని ఎఱుక్కుండా, కారు, మలుపు తిరిగేదాకా చూచిచూచి కారు మలుపుతిరగడంలో తలతిరిగి అక్కడే ఆ యిసకమీదనే పడిపోయింది ఆతల్లి.

ఊటగడ్డ ఆప్రాంతాన్ని వెయ్యినొక్క కుక్క అయినా యీపాటికి ఈని తమపిల్లల్తో సుఖంగా సంచరించి వుండాలి, లతు సరీసృపాలైనా గ్రుడ్డుపెట్టి పొదిగి పొందిగ్గా తమ కూనల్తో ప్రాకులాడి వుండాలి, కోటిపక్షులైనా చెట్లమువ్వల్లో క్రొవ్వి కేరింతా లాడి ఈకెలురాని తమనిసుగుల్ని సాక్కుంటూ సంగీతాలు తీసివుండాలి. అక్కడే ఒకానొక ఆడమనిషి, బిడ్డను కని, మనవలె నంటే, ఎందు కంత బీభత్సమైపోవాలి ఇహలోకము? ఎందు కంత విపరీతమని అనుకోవాలి ఆముష్మికనాకము? ఎందుకంతగా వెల్లడికాకుండా ఉంచాలని ప్రయత్నించి వుండాలి ఆ మాతే? ఆమాతే?— ఇది మహాసమస్యకాదా సంఘానికీ, సౌఖ్యానికీ, జాతికీ, నీతికీ? ప్రతీమాతృస్వరూపిణికీ? ఆబాలెంతరాలి యొక్క తొల్లింటి పరిహాసపాత్రమైన నిర్బంధ ప్రారబ్ధము, ఆమె యొక్కయు ఆమెను ప్రేమించినవాని యొక్కయు అన్యోన్యవియోగ ఖండకావ్యావృతముయొక్క ఆద్యంత రహితనిశ్శబ్దము, ఆమె యునికీ మనికీ, వాని సిరీ సంపదా, వాటి నన్నింటినీ యీసడించిన రచ్చపట్టుల యొక్క కుత్సిత సాంప్రదాయలుబ్ధత్వమూ, ఇవన్నీ ఎంతమాత్రమూ కథకు పోషకములు గాకపోయినా పవిత్రపు బుక్కుల్లాగ నిక్కపుటూక్తుల నెప్పటికేని వెల్లడిగాకమానవు.

* * * *

ఎప్పుడైతే కనకాంబరం నీలాంబరం అన్న ఆపిల్లలిద్దఱూ తమకు దొఱికిన ఆనాటి విశేషప్రాణుల రెండింటిని ఆసుపత్రికి దీసికొనిపోయి పురుషుని జెనరల్ వార్డుకు, శిశువుని మెటర్నిటీవార్డుకు అప్పజెప్పినారో అప్పుడే ఆవార్త పుకారుగా పట్నాన్నంతనూ శేగ్గోకింది. "టి. పి." లకేమిటి "ఆర్. పి." ల కేమిటి, "జి. డి." లకేమిటి, "సి. ఐ. డి" లకేమిటి ఎక్కడెక్కడవున్న పోలీసులకు పని కల్పనైంది. ఆ పిల్లను కని పారేసిన తల్లి యెవ్వర్తె యని ఆచోకీ తీస్తూవున్నారు. దండిస్తామంటూ వున్నారు. దానికి మగాడెవడన్నా వున్నాడా, వుంటే వాని చహరా చెప్పమంటూవున్నారు.

అదంతా లౌక్యము! పరమలౌక్యము!— ఆసుపత్రిలోవాళ్ల కా లౌక్యంతో ఎట్టిసంబంధమున్నూ లేదు. ఆసుపత్రిలోని ప్రతీవైద్యుని కృషీ ఆనాడు ఆ రెండు ప్రాణాల్నీ ఎలా సంరక్షించడం అనే విశ్వప్రయత్నంలో లీనమైపోవడమే! వారికి పేర్లతో సంబంధంలేదు. భాగ్యంతో తగులాటంలేదు, కులంతో నిమిత్తంలేదు, బొందిలో ప్రాణం నిలిపి జీవి ననామయంగా జేసిచూపడమే వారి మహదాశయం.

ఇసకకొండమీద సుప్రతిష్ఠితమైయున్న ఆ మహాభిషక్స్థానను ఇక్కడ కొంచెమైనా వర్ణించకపోతే కథకు విశ్రాంతి మఱిదొఱకదేమో?—ఊరికంతకూ ఎత్తయినస్థలం అది.

ఓతట్టుచూస్తే అపారమైన నీలనీలాంబుధి తేలియాడుతూవుంటుంది. ఓతట్టుచూస్తే ఏరాడ కొండ కతిపయోత్తుంగ తాళపాదపశిఖాగ్రాల్తో ప్రత్యక్షమైవుంటుంది. ఓతట్టు పెద్ద హార్బరు గొప్పగొప్ప పొగయోడలతో కనిపిస్తూవుంటుంది. నాలుగోతట్టు తిన్నగా తిలకిస్తే "సీతమ్మధార" నాబడే లోయయొక్క పచ్చని చిక్కని ఛాయ తనచల్లనిచూపుల్ని ప్రసరిస్తూ వుంటుంది.

* * * *

ప్రాణాలు పోవడం అనేదివస్తే ఎవరికో గాని మధ్యాహ్నంపోవు: సర్వసాధారణంగా చాలామందికి సాయంకాలపు చల్లపొద్దులోనే తెల్లవాఱగట్లనో పోతూవుంటాయి. డాక్టర్లకూడా అదేభయం. "ఈ రాత్రి గడిస్తే బ్రతికినట్టే రోగి" అని వాళ్లు అనడం తఱచు వింటాం. ఆసుపత్రికి పోయేమార్గాన్ని ఎండతాకుడు పడమటితట్టునుంచి కొట్టడం ప్రారంభించింది. క్రమంగా ఎండతీక్ష్ణత తగ్గింది. సూర్యుడు కొండవెనక్కిపోలి ఏరాడ జనపద ప్రాంతాన్నొ అన్నట్టు క్రుంకిపోతూవున్నాడు.

ఆ సూర్యాస్తమయ ఘడియలు పూర్తి కాకుండా రూల్సుప్రకారంగా పోలీసులు వొక చచ్చిపోయిన ఆడమనిషిని పోస్టుమార్టెమ్‌కు గాను ఆసుపత్రికి తీసికొని వస్తూవున్నారు. తీసికొనివస్తూ దారంట అంటూ వున్నారు. "ఈమె మిక్కిలీ నిర్భాగ్యురాలు తన్ను ప్రేమించినవానికైనా తాను పురుడు పోసుకోవడం తెలిస్తే తనకు తలవంపు లనే విచింతసంకొద్దీ ప్రియునితోకూడా చెప్పకుండా, ప్రియు డెఱుక్కుండా తలుపీవల తాళంవేసికొని నిన్న సాయంకాలం లేచిపోయిందట. లేచిపోయినందుకు అనుభవించింది! దిక్కులేనిచావు చచ్చింది. పోనీ కన్నపిల్లమీద అపేక్షకొద్దీ దైవికంగా కారుదొరికింది అని ఆకారులో ఆపిల్లను పరుండబెట్టిన మనిషి తాను తిన్నగా యింటికిపోయి కస్తూరో తాంచేటిచెరో వేసుకోక, సముద్రపునీటి బాహాటపుగాల్లో, చవిటిపఱ్ఱ నట్టాడుతూ వాతం కమ్మించుకోవడం ఏం తెలివితేటలు" పూర్వకృతకర్మపరిపాకం కాకపోతేను? అని పోలీసు సబుఇన్సపెక్టరు తమ్మయ్య రోడ్డుమీద నిలబడి నిర్వచిస్తూన్నాడు. "పాపం! చంటిబిడ్డన్నా బ్రతికిందో లేదో? తత్సంబంధమైన ఋణానుబంధం పచ్చనిపసిటి కొంగుపే కరూపకంగా తీరిందనుకోవాలి మనం" అని పంచాయితీ రిపోర్టువ్రాసిన విలేఖరి బ్రహ్మయ్య క్రిందప్రక్కబాటనే గొంతుకూకుని అంటూ వున్నాడు.

స్త్రీయొక్క శవం ఇనక్కొండ మీదకు తేబడుతూ మెల్లమెల్లగా వైద్యవిద్యాలయపు "ఎనాటమీ" తరగతి కట్టడములకేసి వాహకుల బుజాలమీద ముఖమాత్రంగా దర్శనీయమౌతూ చలిస్తూవుంది. ఆదృశ్యం చూచిన ప్రతివ్యక్తీ కుక్రీనుండి చమారీదాకా "పొడుగైన పోక, సన్నని శలాక, చక్కని చుక్క, తోలికానుపై యుండాలి, తలకట్టెంతుందో, అహో! చెవుల దిగుచాయకంటా

చెపల్సి చెప్ప శక్యంగాని ఎవరికీ లేని నీలి నీలి చిటిపొటి కురుల యొక్క ముడి ముడి యిరుల కళ! ఆకళింకా ఆలాగే నిలిచి వుంది." అని నివ్వెఱపడి చూస్తూ విషాద భరితులైన వారే.

ఆలా ఆస్త్రీవ్యక్తియొక్క కట్టె ఆసుపత్రికత్తికోతగ్గాను తీసికొనిరాబడుతూవున్న పరిక్లిష్ట సమయంలో నీలాంబరం కనకాంబరం ఏంచేస్తూ వున్నారు? కనకాంబరం కానుపుల కాను కటకటాలగుండా చూస్తూ వుంది, ఎనాటమీ కట్టడంకు గొనిపోబడుతూ వున్న కొత్తశవం కేసి. నీలాంబరం జెనరల్ వార్డులో పరుండబెట్టబడ్డ కాలకూట మూలజ్ఞునియొక్క శరీరోష్ణిమగాజుపుల్లనే గమనిస్తూ చూస్తూవుంది తనూ ఆశవం కేసే.

*   *   *   *

కనకాంబరందగ్గఱకు దాది వొకర్తె వచ్చి "మీ రుదయం తీసికొనివచ్చిన చంటిపిల్ల బ్రతకలేదు. దాన్ని కన్నతండ్రి సవాయితవాయిగాడైయుండాలిసుమండీ!" అంది. కనకాంబరం తనకు లోలోపుట్టుకొచ్చే దుఃఖం ఆపుకుంటూ గద్గదికతో అంది "ఆలా అనుకోవడం ఎందుకు మనం?—పుట్టీపుట్టనప్పట్నుంచీ కనపడని దారిద్ర్యపు హోరుగాలి జల్లుకూ, కనబడినీన్ని తియ్యందన మెఱుగని కడలి నిలవపడియల తేమపొర్లుకూ, పసిపిల్ల కొయ్యబారి చనిపోయిందని ఏల అనుకోరాదు?" అంది. అంటూ నీలాంబరాని కా సంగతి చెబుదామని బయులుదేరి ఆమెవున్న వార్డు దరిసింది. నీలాంబరం గుమ్మందగ్గఱే ఎదురై "ఇఖ ప్రయోజనంలేదు. ఆ కొత్తగా ఆలా తీసికొనిపోబడుతూవున్న తనప్రియురాలి శవం కేసి చూస్తూ రక్తశూన్యుడై ప్రొద్దుటి సముద్రపు మనిషి "ఆమె కౌగింటిలో" అని ఓపాట పాడుతూ తనహంసకు స్వస్తిచెప్పాడు. సీముఖవైఖరిచూస్తే చంటిపిల్లా జీవించినట్లులేదు. మనమిరువురం ప్రస్తుత మింక చేసేకర్తవ్య మీ ఆసుపత్రిలో మత్తేముంది కనుక—కనకాంబరం! రా! అటు చూడ కింక! ఆ కానుపులకాను కేసి చూడకు. సముద్రపుమనిషి కడసారి పాడిన పాట విను.

"ఆమెకౌగింటిలో నా కోర్కె పండిస్తి
ఆమెకందోయిలో నా మేడనిర్మిస్తి
ఏవాడనైనాను గన్నారటరా
నాచేడెజాడ తెలిసుంటె చెప్పరా!
పెదపెద్దవీథుల్ల పిలిచి విసికాను
యిసుకతిన్నెల నీలవేసి యలిసాను
మసకసంజలో పందియంగ బ్రమిశాను
కొసకు గాదని తెలిసి కదలిడాశాను."

అని పాడింది.

కనకాంబరం తననేస్తం నీలాంబరంపాడిన కొత్తపాట ఆలా వింటూ ఇసకొండ దిగుతూ, నీలాంబగాన్ని సింహాచలం దిక్కుగా జూడమంది. సీతమ్మ గడ్డయొక్క సన్నటి ధారనే ఒకటి, రెండు, మూడు కునుకుకిరణాలు సూర్యునివి ప్రతిబింబించినవి. ఏతత్ప్రతిబింబితకిరణత్రయమే నాటిరేయి మహదాశ్వాసము!